


న్యూ ఢిల్లీలో అవార్డును అందుకుంటున్న న్యాక్ డైరెక్టర్లు శాంతి శ్రీ, ఎం. రాజిరెడ్డి


## న్యాక్‌కు అవార్డు

మాదాపూర్, జనవరి 20: వృత్తి నైపుణ్య శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) సంస్థకు అసోచామ్ ఇంటర్నేషనల్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డు – 2023 వరించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన 6వ ఇంటర్నేషనల్ సస్టైనబిలిటీ కాంక్లేవ్‌లో న్యాక్ డైరెక్టర్లు శాంతి శ్రీ, ఎం. రాజిరెడ్డికి అసోచామ్ ప్రతినిధులు అవార్డును అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, న్యాక్ డైరెక్టర్ కె. భిక్షపతిని అభినందించారు.



## నిమ్స్‌లో ఉద్యోగ అవకాశం

సిటీబ్యూరో, జనవరి 20(నమస్తే తెలంగాణ) : నిమ్స్ వైద్యశాలలో క్లినికల్ రీసెర్చ్ నర్స్ ఖాళీని భర్తీ చేసేందుకు అధికారులు నోటీఫికేషన్ జారీ చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూరాలజీ విభాగంలో పనిచేసేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు www.nims.edu.in సంప్రదించాలని సూచించారు.




## హెచ్‌ఎండీఏ.. అప్‌డేట్ కాలె..

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): మహానగరంలో జీహెచ్‌ఎంసీ తర్వాత అంతటి ప్రాధాన్యమున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పౌరులకు సరైన సమాచారం అందడం లేదు. 7 జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌ను నిత్యం వేలాది మంది పౌరులు సందర్శిస్తుంటారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. కొత్తగా కమిషనర్‌తో పాటు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ బాధ్యతలు చేపట్టారు. మరికొందరు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. డిప్యూటేషన్‌పై వచ్చిన వారిని తిరిగి మాతృ సంస్థకు పంపించారు. ఇవన్నీ మార్పులు జరిగినా.. హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో మాత్రం తాజా సమాచారాన్ని అప్‌డేట్ చేయకపోవడం గమనార్హం.



దుర్గయ్య (ఫైల్)

## తాను మరణిస్తూ..

ఖైరతాబాద్, జనవరి 20 : తాను మరణిస్తూ ఐదుగురికి జీవన దానం చేశాడో అన్నదాత. నల్గొండ జిల్లా శాలిగోపురం మండలం, ఇటుకుల పహాడ్‌కు చెందిన దుర్గయ్య (50)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 16న దుర్గయ్య బాత్‌రూమ్‌లో అపస్మారకస్థితిలో పడిపోయాడు. కుటుంబసభ్యులు ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించగా, చికిత్స అందించిన వైద్యులు 19న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబసభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవ దానం విశిష్టతపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దుర్గయ్య శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

## రాములోరి దర్శనానికి స్పెషల్ రైళ్లు

### ఈ నెల 29 నుంచి మార్చి 3 దాకా సేవలు





పెద్దపల్లి, జనవరి 20(నమస్తే తెలంగాణ): అయోధ్య శ్రీ రాముల వారి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం ఈ నెల 22న జరుగనుండగా, రైల్వే శాఖ మన రాష్ట్రం నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ నెల 29 నుంచి వచ్చే మార్చి 3వ తేదీ వరకు అయోధ్య ధాం రైల్వే జంక్షన్‌కి సికింద్రాబాద్, కాజీపేట, జాల్నా నుంచి ఆస్థా స్పెషల్ సర్వీసులు నడపాలని నిర్ణయించి, వాటి వివరాలు వెల్లడించింది.



శనివారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

# హామీల అమలుకు వెంటాడుదాం

### ప్రతి హామీ అమలు చేసేదాకా కాంగ్రెస్‌ను వదిలేది లేదు

### ఈసారి సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం మనదే



- వచ్చే మూడు, నాలుగు నెలల్లో జిల్లా పార్టీ నూతన కార్యవర్గం
- ప్రతి నెలా అసెంబ్లీ నియోజకవర్గ సన్నాహక సమావేశం
- త్వరలో బంజారాహిల్స్‌లో జిల్లా పార్టీ నూతన కార్యాలయం నిర్మాణం
- హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో కేటీఆర్

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై గులాబీ జెండాను ఎగరవేద్దామని, ఆ దిశగా శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో ఎవరూ అధైర్యపడొద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేద్దామన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ నేతలు కాకమ్మ కథలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఓడినా గెలిచినా.. బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజాపక్షమేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసే దాకా వెంటాడుతామని స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. లోక్ సభ ఎన్నికల కార్యాచరణ, గెలుపు వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఐదేండ్లలో ఏం చేశారో నిలదీయాలన్నారు. కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడితే, కిషన్‌రెడ్డి సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్‌లను జాతికి అంకితం చేశారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇదే ఆయన చేసిన అతిపెద్ద పని అని విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 36 ఫ్లై ఓవర్లు కడితే ..ఉప్పల్, అంబర్‌పేట ఫ్లై ఓవర్లు సంవత్సరాలైనా.. కట్టలేక చేతులెత్తేశారన్నారు. బీఆర్ఎస్ వల్లే బీజేపీ సీనియర్ నాయకులు హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో పోటీకి వెనుకంజ వేశారని, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకునే దిశగా ప్రతి ఒక్క కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలన్నారు. త్వరలోనే బంజారాహిల్స్ రోడ్ నం. 12లో బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. ప్రతి మూడు నెలలకోసారి పార్లమెంట్ పరిధిలోని సన్నాహక సమావేశం, ప్రతి నెల నియోజకవర్గాల వారీగా సమావేశాలు జరుపుదామని చెప్పారు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో జిల్లాకు నూతన కమిటీలు వేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్ తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, బాబా ఫసియుద్దీన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ జరుగుతలేదు

### సిటీలో స్వచ్ఛత ప్రశ్నార్థకం?

- రోజూ అటెండెన్స్‌లోకి రాని 1000 స్వచ్ఛ ఆటోలు
- జోనల్ కమిషనర్లపై కమిషనర్ ఆగ్రహం

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం నీరుగారుతున్నది. ఎక్కడి వ్యర్థాలు అక్కడే పేరుకుపోతున్నాయి. స్వచ్ఛత ప్రశ్నార్థకమవుతున్నది. చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్‌ఎంసీ తొలగించింది. పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ చేపట్టి..వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 వాహనాల ద్వారా సిటీలోని 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించాలి. ఒక్కొక్క ఆటోకు సుమారు 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి.. చెత్త సేకరణ చేయాలి. కానీ కొన్ని రోజులుగా అలా జరగడం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం వాటి అటెండెన్స్ ఉండటం లేదు. ప్రతిరోజు 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా కమిషనర్ రోనాల్డ్ రాస్ ఇటీవల గుర్తించారు. పర్యవేక్షణ లోపించిందని జోనల్ కమిషనర్లపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్వచ్ఛ ఆటోల పనితీరులో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కాగా, సమయ పాలన పట్టించుకోకపోవడం, వ్యర్థాల సేకరణలో అధిక వసూళ్లకు తెరలేపడం, సిటీలో ఉండాల్సిన స్వచ్ఛ ఆటోలు గ్రేటర్ సరిహద్దులు దాటడం వంటి వ్యవహారాలపై ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్వచ్ఛ ఆటోలను దారిలోకి తీసుకురావాలని, ఉదయం వాహనం బయలుదేరే సమయం..వ్యర్థాల సేకరణ పూర్తయ్యాక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు వెళ్లే వరకు 'క్యూ ఆర్' స్కాన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.




మాసబ్‌ట్యాంక్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు



మినీ స్టేడియం స్థలంలో శనివారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జేసీబీ

## ఆక్రమించారు.. కూల్చేశారు

- మినీ స్టేడియం స్థలంలో ఆక్రమణలు
- 15 గదుల నిర్మాణాలు.. నేలమట్టం చేసిన బల్దియా

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : స్టేడియం స్థలాన్నే కాజేయాలని చూసిన అక్రమార్కుల కుట్రను భగ్నం చేసింది బల్దియా. కాప్రా సర్వే నంబర్ 199/1లో 12 గుంటల ప్రభుత్వ స్థలాన్ని మినీ స్టేడియం నిర్మాణానికి అప్పగించారు. ఈ స్థలంలో స్థానికులు కొందరు 15 సింగిల్ రూమ్ ఇండ్లను నిర్మించారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు అందడంతో రంగంలో దిగిన ఎల్బీనగర్ జోన్ సీపీ ప్రసాద్ రావు నేతృత్వంలో ఏసీపీ గిరి రాజ్.. స్థానిక పోలీసుల సాయంతో ఆక్రమణలను నేలమట్టం చేశారు. భవిష్యత్‌లో కబ్జా కాకుండా స్థలం చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి బోర్డును పాతారు. అక్రమార్కులపై స్థానిక జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బల్దియా ఫిర్యాదు చేసింది.

# పడకేసిన ప్రాజెక్టులు!

hmda Growing Global

### కొత్తగా టెండర్లు లేవు... అభివృద్ధి పనుల ఊసేలేదు

### భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం.. నత్తనడకన హెచ్‌ఎండీఏ పనితీరు

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): మహానగర నిర్మాణంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) మహోన్నత పాత్ర పోషిస్తున్నది. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా చేపడుతూ.. నగరవాసులకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పరిధిలో చేపట్టిన ప్రాజెక్టులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు వచ్చేందుకు దోహదం చేశాయి. ఐటీ రంగంలోనే కాకుండా రియల్ ఎస్టేట్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్స్ వంటి వాటిల్లో వేల కోట్ల పెట్టుబడులు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో వచ్చాయి. నగర భవిష్యత్తును మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేలా ఎన్నో ప్రాజెక్టులను, అత్యాధునిక మౌలిక వసతులను కల్పించారు. అయితే కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత హెచ్‌ఎండీఏ కొత్తగా ప్రాజెక్టులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం లేదు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల పనులను కొనసాగించడం లేదు. నిత్యం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలంటూ సచివాలయం, బుద్ధ పూర్ణిమ అథారిటీ కార్యాలయం, అమీర్‌పేటలో స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్సులోని హెచ్‌ఎండీఏ కార్యాలయాలకే అధికార యంత్రాంగమంతా పరిమితమైంది.

#### ఫైళ్లు కదలడం లేదు..

ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగాల్లో ఫైళ్లు ముందుకు కదలడం లేదు. ప్రతిపాదిత ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, పనుల్లో చలనం లేదు. శివారు ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్ల వంటి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులు గడిచినా.. క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టులపై దృష్టి సారించడం లేదు.ప్రస్తుతం హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఉన్న దానకిశోర్, అత్యంత కీలకమైన పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీగా ఉన్నారు. సచివాలయంలోనే ఆయన బిజీగా ఉండడంతో హెచ్‌ఎండీఏకు సంబంధించిన కార్యకలాపాలపై ఎక్కువగా దృష్టి సారించకపోవడమే కాకుండా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నది. ప్రధానంగా హెచ్‌ఎండీఏలో అత్యంత కీలకమైన ఇంజినీరింగ్, ప్లానింగ్ విభాగాల పరిధిలో జరగాల్సిన పనుల్లో సరైన పురోగతి లేదనే ఆరోపణలు ఉన్నాయి.

KIMS HOSPITALS™

### కిమ్స్‌లో మూలుగ

## మూలకణం మార్పిడి

### జాంబియాకు చెందిన బాలుడికి శస్త్రచికిత్స

బేగంపేట, జనవరి 20 : కిమ్స్ వైద్యశాలలో మూలుగ మూల కణం మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. డాక్టర్ నరేందర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాంబియా రాజధాని లుసాకాకు చెందిన 14 ఏండ్ల బాలుడు సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి వచ్చినవారిలో రక్తం తగ్గిపోవడం, విపరీతమైన కీళ్ల నొప్పులతో దైనందిన పనులు చేసుకోలేని పరిస్థితి ఉంటుంది. అటువంటి స్థితిలో జాంబియాలో వైద్య సదుపాయాలు లేకపోవడం, కిమ్స్ వైద్యుల గురించి తెలుసుకున్న బాలుడి తండ్రి.. ఇక్కడికి వచ్చారు. సహజంగా మూలుగ మూల కణం దాతలు ఎవరూ ముందుకు రారు. బాలుడి చెల్లెలు తన అన్నకి మూలకణం ఇచ్చేందుకు ముందుకు రావడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. మూల కణం దానం చేసిన చెల్లెలు కూడా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తురాలేనని, అయితే బాలికకు వ్యాధి తీవ్రత తక్కువగా ఉన్నదని, అతి తీవ్ర స్థాయి నుంచి బాలుడు కూడా ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటాడని వైద్యులు తెలిపారు.







## అలా.. ఆకాశవీధిలో..

బేగంపేట విమానాశ్రయంలో 'వింగ్స్ ఇండియా–2024' వైమానిక ప్రదర్శన శనివారం సైతం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన విభిన్న రకాల లోహ విహంగాల ముందు సెల్ఫీలు దిగుతూ.. సందడి చేశారు. నింగిలో రంగు రంగుల పొగలు చిమ్ముతూ..విమానాలు, హెలికాప్టర్లతో చేసిన విన్యాసాలు అబ్బురపర్చాయి. నేడు ఎయిర్ షో చివరి రోజు కావడంతో భారీగా సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నది.

